# వారసత్వ ఉద్యోగాల నియామక పునరుద్ధరణను కోరుతూ సింగరేణిలో సమ్మె

**జూన్** 15వ తేదీనుండి 10 రోజులపాటు సింగరేణి బొగ్గు గనుల్లో సమ్మె జరిగింది. కేంద్ర కార్మిక సంఘాలైన ఎ.ఐ.టి.యు.సి, ఐ.ఎన్.టి.యు.సి, సి.ఐ.టి.యు, హెచ్.ఎం.ఎస్‌ల పిలుపుమేరకు యీ సమ్మె జరిగింది. సింగరేణిలో రిజిష్టరయిన యితర సంఘాలు యీ సమ్మెను బలపరిచాయి. ఒక్క టి.ఆర్.ఎస్ అనుబంధ కార్మికసంఘమైన టి.బి.జి.కె.ఎస్ మాత్రం యీ సమ్మెను వ్యతిరేకించింది.

సింగరేణిలో అదేవిధంగా యితర బొగ్గు గనుల్లో కార్మికులు భూగర్భంలోకి దిగి, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో, నిరంతరం ప్రాణప్రమాద పరిస్థితుల్లో పనిచేస్తారు. గాలి, వెలుతురు లేని స్థలాల్లో, దుమ్ము - ధూళిని పీల్చుతూ పనిచేయాల్సిన పరిస్థితుల్లో వున్నారు. కనుక బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ వృత్తికి సంబంధమైన వ్యాధులబారిన పడతారు. తీవ్రమయిన అనారోగ్యానికి గురై విధులను నిర్వహించలేని అనివార్యపరిస్థితికి నెట్టబడతారు. వయస్సు ముదిరేకొద్దీ, పనిచేయలేని స్థితికి బలవుతారు. అటువంటి పరిస్థితుల్లో వారు అనారోగ్య పరిస్థితి కారణంగా ఉద్యోగ విరమణను తీసుకొంటారు. అటువంటి కార్మికులపై ఆధారపడ్డ కుటుంబాలు గడవటంకోసం, తమపై ఆధారపడ్డ కుటుంబ సభ్యుల ఉద్యోగ నియామకాన్ని డిమాండు చేసి, పలు ఆందోళనలు జరిపి, పోరాడి, విధులు నిర్వర్తించలేమనే కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగం పొందే హక్కును, 1981 సెప్టెంబరులో, యాజమాన్యంతో (సింగరేణి) చేసుకొన్న ఒప్పందం ద్వారా కార్మికులు సాధించుకొన్నారు. ఆ ఒప్పందం ప్రకారం అప్పటినుండి సింగరేణి కార్మికులకు వారసత్వ ఉద్యోగాల నియామకం సాగుతూనే వుంది.

కానీ 1990 దశకంలో దేశంలో అమలులోకి తెచ్చిన సామ్రాజ్యవాద నయాఉదారవాద ఆర్థిక సంస్కరణల విధానాలు, ప్రపంచబ్యాంకు ఆదేశిత పారిశ్రామిక సంస్కరణల అమలు పర్యవసానంగా, సింగరేణి యాజమాన్యం, యీ వారసత్వ ఉద్యోగ నియామక విధానపు అమలును ఆపివేసింది. ఫలితంగా, అనారోగ్య కారణాలపై ఉద్యోగ విరమణచేసిన కార్మికులపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు వందల మంది నియమింపబడక వదిలివేయబడ్డారు. 1998వ సంవత్సరం మే నెల నాటికి అటువంటి ఉద్యోగ విరమణచేసిన వారి పిల్లలు 1150 మంది వరకూ నియమింపబడక వదిలివేయబడ్డారు.

వారందరికీ ఉద్యోగ నియామకం జరగాలని డిమాండుచేస్తూ 25-5-98 నుండి సింగరేణిలో సమ్మె జరిగింది. నాటి ముఖ్యమంత్రి చర్చలు జరిపి, జాతీయ కార్మిక సంఘాలతో 6-6-1998న ఒక ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పంద ప్రకారం, అప్పటివరకూ ఉద్యోగాలకోసం వేచిచూస్తున్న 1150 మందిలో సగం మందికి (575) వారసత్వ ఉద్యోగాలు యివ్వటం, మిగిలిన వారికి ఖాళీలను బట్టి ఉద్యోగాలు, లేదా వద్దనుకొంటే 2 లక్షల రూపాయలు లేదా 24 నెలల జీతం చెల్లించటానికి సింగరేణి యాజమాన్యం ఒప్పుకొంది. ఇంచుమించు మిగిలిన 575 మందీ ఉద్యోగ నియామకానికి బదులు, యాజమాన్యం యివ్వచూపిన మొత్తాలు తీసుకొన్నారు.

అయితే యీ అంశంమీద, తమ హక్కును నిలబెట్టుకొని, అమలు జరిపించుకొనేవిధంగా అటు కేంద్ర కార్మిక సంఘాలుకానీ, యిటు సింగరేణిలో రిజిష్టరయిన యితర కార్మిక సంఘాలుగాని పట్టుదలతో కృషి చేయలేదు. కేవలం గుర్తింపు ఎన్నికల సందర్భంగా యీ డిమాండును లేవనెత్తటం, ఆనక మరిచిపోవటం అన్నది కార్మిక సంఘనాయకత్వాల క్రీడలో ఒక భాగంగా మారిపోయింది.

అయితే రాష్ట్ర విభజనను కోరుతూ, ప్రత్యేక తెలంగాణాను డిమాండు చేస్తున్న టి.ఆర్.ఎస్ గెలుపు కోసం, తన ఎన్నికల ప్రణాళికలో(2014) “నిలిపి వేయబడ్డ వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరిస్తామన్న” హామీకూడా యిచ్చి, సింగరేణి కార్మికుల ఓట్లను కూడా పొంది ఎన్నికలలో విజయం సాధించింది.

తిరిగి 1998 నుండి డిసెంబరు 2016 నాటి వరకూ 10వేలమంది కార్మికులు వారసత్వ ఉద్యోగాలను కోల్పోయారు. మరోవైపు యీ అంశంపై కేంద్ర కార్మిక సంఘాలు, యాజమాన్యంతో అప్పుడప్పుడు మాట వరసకు చర్చలు జరిపాయే తప్ప, ఒప్పందం చేసుకొన్న విషయం అమలుజరపమని పట్టుపట్టింది లేదు.

ఈలోగా యాజమాన్యం 20-12-2016న, వారసత్వ ఉద్యోగ నియామక విధానంపై ఒక సర్క్యులర్ జారీచేసింది. ఆచరణలో యిది వారసత్వ ఉద్యోగాల హక్కు నిరాకరించి వెనక్కి తీసుకొనే విధంగా వుంది.

ఈ విషయమై ఉన్నత న్యాయస్థానాలైన హైకోర్టు, సుప్రీంకోర్టులు వివిధ వ్యాఖ్యలు చేస్తూ, వారసత్వ ఉద్యోగాల నియామకంపై గందరగోళం సృష్టించి, అస్పష్టమైన తీర్పులు యివ్వటంవలన, వాటిని ఆధారం చేసుకొన్న సింగరేణి యాజమాన్యం, వారసత్వ ఉద్యోగుల నియామకపు విధానాన్ని రద్దుచేసే వైపుకే ముందుకు సాగింది.

కేంద్ర సంఘాలు 20-12-2016 నుండి యిప్పటివరకూ సింగరేణి యాజమాన్యంతో పలు ధపాల చర్చల తతంగాన్ని జరిపి (చట్టబద్ధమయిన వివాద పరిష్కార ప్రక్రియ-పద్ధతులను అమలుజరిపి) ఎట్టకేలకు 2017 జూన్ 15 నుండి సమ్మెలోకి దిగారు. డిపెండెంట్ ఉద్యోగాల నియామక ప్రక్రియ పునరుద్ధరణ డిమాండుతో సమ్మెను జరిపారు.

మనదేశంలో కార్మికుల సమ్మె, ఆందోళన సందర్భంగా జరుగుతున్న మాదిరిగానే, సింగరేణి యాజమాన్యం ‘సమ్మె’ను తప్పుపట్టుతూ, అందువలన జరగబోయే నష్టాల గురించి ‘వివరిస్తూ’ “సమ్మె ఎవరిపైన” అంటూ విస్తృత కరపత్ర ప్రచారం సాగించింది. అధికార పార్టీ టి.ఆర్.ఎస్ అనుబంధ కార్మికసంఘం టి.బి.జి.కె.ఎస్ కార్మికులను సమ్మె చేయవద్దు అంటూ ప్రచారం కావించింది.

సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి సింగరేణి యాజమాన్యంతో కలసి అనేక కుట్రలు చేసింది. గనులపై క్యాంటిన్లను సింగరేణి యాజమాన్యం బార్లుగా తయారుచేసి, మందు బిర్యానీ పొట్లాలను టి.బి.జి.కె.ఎస్ కార్యకర్తలకు సరఫరా చేస్తూ, సమ్మె విచ్ఛిన్నానికి ప్రోత్సాహపరిచింది. పోలీసులను రంగంలోకి దించి సమ్మె చేస్తున్న సంఘాల నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయించింది.

అయినప్పటికీ సింగరేణి కార్మికులు, యీ అననుకూలతలను ఎదిరిస్తూ సమ్మెలో పాల్గొన్నారు. ఖమ్మంజిల్లా – సత్తుపల్లిలోని భూగర్భ, ఓపెన్ కాస్టు గనులలోనూ, భద్రాద్రి–కొత్తగూడెంజిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందులలోనూ, కోయగూడెంలోని ఓపెన్‌కాస్టు గనులలోనూ ఈ సమ్మె విజయవంతంగా జరిగినట్లు మీడియా రిపోర్టులు తెలియజేస్తున్నాయి. కానీ సింగరేణి యాజమాన్యం మాత్రం యీ సమ్మె ప్రభావం అంతగా లేదు అంటూ ప్రకటనలు చేస్తూనే వుంది.

ఈ సింగరేణి సమ్మెను గమనిస్తే, దేశంలోని కార్మికసంఘ ఉద్యమంలో వున్న అన్నిబలహీనతలు, అపసవ్య నిర్వహణాపద్ధతులు, లోపాలూ స్పష్టంగా గోచరిస్తాయి.

ఇప్పుడు వారసత్వ ఉద్యోగాల నియామక పునరుద్ధరణ డిమాండ్‌పై సమ్మె జరిపినా, అటు కేంద్ర కార్మిక సంఘాలుకానీ, యిటు సింగరేణిలో రిజిష్టరయిన యితర కార్మిక సంఘాలుగానీ, కీలకమయిన, న్యాయసమ్మతమైన, పూర్తిగా సమర్ధనీయమైన, యీ డిమాండును (హక్కును) పరిరక్షించుకొనటానికి బలంగా, పట్టుదలతో వ్యవహరించక సమస్యను నానబెట్టాయని అర్థమవుతుంది.

6-6-1998న కేంద్ర యూనియన్లు యీ విషయమై చేసుకొన్న ఒప్పందంలోనే, యీ హక్కును జారవిడచుకొనే అవకాశం కల్పింపబడిందనీ, ఆర్థికవాద కార్మికసంఘ నాయకత్వాలు, కార్మికులు తమ హక్కును విడనాడుకొనేందుకు, ఎగవేయబడటానికి వీలుగా అవకాశం కల్పించారనీ అర్థమవుతుంది. ఈ సమ్మె అనుభవంవలన, అధికారంలో వున్న రాజకీయ పార్టీ అనుబంధ కార్మికసంఘాలు, కేవలం ఆ రాజకీయ పార్టీల ప్రయోజనాలను కాపాడటానికే ప్రాధాన్యం యిస్తూ, అందుకుగానూ కార్మిక ప్రయోజనాలను నిస్సంకోచంగానే పణంగా పెట్టి బలియివ్వటానికే నడుం కడుతున్నాయని అర్థమవుతుంది.

చట్టబద్ధత అన్నది కార్మిక సంఘ నాయకత్వాలు, కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించలేని నిర్వీర్యతకు గురిచేస్తున్నాయని అర్థంఅవుతుంది.

త్రాగుడులాంటి దురలవాట్లు కార్మికులను తమ ప్రయోజన పరిరక్షణ లక్ష్యంనుండి దూరంచేసి, అందుకు వ్యతిరేకులుగా మలుస్తాయని-యిది కార్మికవర్గ సంస్కృతి కానేకాదనీ దోపిడీవర్గ సంస్కృతి అనీ స్పష్టంచేస్తోంది.

నిరంతరం కార్మికుల్లో వుంటూ, వారిని వర్గ (కార్మిక) రాజకీయ చైతన్యంతో చైతన్యపరచకుండా, కేవలం ప్రదర్శనాత్మక లాంఛనప్రాయపు ఆందోళనలు, సమ్మెలు ద్వారా కార్మికుల కనీసపు ప్రయోజనాలను కూడా పరిరక్షించటం సాధ్యంకాదని యీ సమ్మె అనుభవం తెలియజేస్తుంది.

సమ్మెకోసం సమ్మె చేసినంతమాత్రాన అది నిజమైన అర్థంలో కార్మిక పోరాటం కోబోదు–కానేరదు అన్న వాస్తవం గ్రహించి, కార్మికులు నిజమైన ఐక్యతతో పోరాడాల్సిందే తప్ప మరో సులువైన మార్గం లేదన్నదే యీ సమ్మె అనుభవం అందిస్తున్న గుణపాఠం.

ooooo